



ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు
తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 213 తిరుపతి తేది : గురువారం 03 జులై 2025 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISTRICTS




## బ్రిక్స్ పట్ల భారత్ నిబద్ధత !
### - పేద దేశాల ప్రాధాన్యతలపై చర్చ
### - ఐదు దేశాల పర్యటనకు బయలుదేరిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, జూలై 2:**

పేద దేశాల (గ్లోబల్ సౌత్) ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్ళేందుకు గల మార్గాలపై రాబోయే రోజుల్లో భారత్, బ్రెజిల్ చర్చిస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం చెప్పారు. ఈ నెల 2 నుండి 9 వరకు ఐదు దేశాల్లో దౌత్యపర్యటనకు బయల్దేరుతున్న సందర్భంగా ప్రధాని ఒక ప్రకటన జారీ చేశారు. రియో డీ జెనీరోలో జరగబోయే బ్రిక్స్ సదస్సు 'సమతుల్యమైన బహుళ ధృవ ప్రపంచ వ్యవస్థ'ను ఏర్పాటు చేయడానికి దోహదపడుతుందని అన్నారు. వారం రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని ఘనా, ట్రినిడాడ్,టబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లో పర్యటించనున్నారు. గ్లోబల్ సౌత్ పరిధిలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందన్నారు. వ్యవస్థాపక దేశంగా బ్రిక్స్ పట్ల భారత్

- మిగతా 2లో..



# 'మహా' బలి పశువులు కార్యకర్తలే!

- మహా టీవీ కార్యాలయంపై దాడి
- కార్యకర్తలపై కేసు నమోదు చేస్తే...
- శిక్ష అనుభవించాల్సిందే కార్యకర్తలే..

**తిరుపతి బ్యూరో - ఆంధ్రనాడు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నారంటూ ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు మహా టీవీ ఆఫీస్‌పై దాడి చేశారు. ఆఫీస్ అద్దాలు, కార్లు, స్టూడియోను ధ్వంసం చేశారు.

విషయం తెలిసిన వెంటనే తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు , ఎంపీలు , సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయాన్ని సందర్శించి తగిన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారని వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వంశీ తెలిపారు ..

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ దాడిని ఖండించారు. భాద్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఖండించారు. మీడియా సంస్థపై భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత గర్హనీయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలు ఉంటే తెలియచేసే విధానం ఒకటి ఉంటుంది. ఇందుకు భిన్నంగా దాడులకు పాల్పడటం సమంజసం కాదని డిప్యూటీ సీఎం తెలిపారు.

జర్నలిస్ట్ సంఘాలు, రాజకీయ పార్టీల దాడిని తీవ్రంగా ఖండించడమే కాకుండా వివిధ జిల్లాలో నిరసనలు తెలిపాయి.. దాడిని ఐజేయూ అధ్యక్షులు కె .శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జనరల్ బల్వీందర్ జమ్మూ ,జాతీయ కార్యదర్శి వై .నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శి కె.విరహత్ అలీ, కె. రాంనారాయణలు ఖండించారు భాద్యులపై చర్యలు

- మిగతా 2లో..





## ప్రభుత్వ విద్య బలోపేతం ఉపాధ్యాయుల బాధ్యత
### - విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**అమరావతి - ఆంధ్రనాడు, జూలై 2:**

ప్రభుత్వ విద్య బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులపై బాధ్యత ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో గిరిజన గ్రామం జెఎం తండాలో ప్రభుత్వ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎం కళ్యాణి కుమారిని 'షైనింగ్ టీచర్' పేరుతో ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. పనిచేస్తున్న పాఠశాలలో కళ్యాణి అంకిత భావంతో పనిచేసి పాఠశాల రూపురేఖలు మార్చి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరికీ ఆమె ఆదర్శంగా

2లో

# రూ. 1292 కోట్లతో స్వర్ణ కుప్పం ప్రాజెక్టు

- ఆదర్శ నియోజకవర్గంగా కుప్పంను తీర్చిదిద్దుతాం
- ఏడాది కాలంగా ఇదే మా పాలసీ: సీఎం చంద్రబాబు
- ఈ ఏడాదిలోనే కుప్పం చివరి ఆయకట్టుకు హంద్రీనీవా జలాలు
- అభివృద్ధి ద్వారా వచ్చిన ఆదాయంతోనే సంక్షేమం అమలు చేస్తామన్న చంద్రబాబు
- విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నాం



**కుప్పం - ఆంధ్రనాడు, , జూలై 2:**

తన నియోజకవర్గమైన కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ ఏడాదిలోనే కుప్పం నియోజకవర్గానికి హంద్రీ నీవా నీళ్లు పారిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రూ.3,890 కోట్లతో హంద్రీనీవా పనులు పూర్తి చేస్తున్నామని, కుప్పంలో చివరి ఆయకట్టు వరకూ నీళ్లు తీసుకొస్తామని తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానని, స్వర్ణ కుప్పం నా లక్ష్యమని అన్నారు. బెంగళూరు విమానాశ్రయం నుంచి కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం తుంశి గ్రామంలోని ఎపి మోడల్

- మిగతా 2లో..



## రైతులకు అండగా నిలుస్తాం

- ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి..
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- లక్ష వ్యవసాయ కుంటలను రైతులకు
- అందుబాటులోకి తెచ్చామన్న పవన్

**అమరావతి- ఆంధ్రనాడు, , జూలై 2:**

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఫామ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ వ్యవసాయ కుంటలు కరవు పరిస్థితుల్లో కూడా రైతులకు ఆసరాగా నిలుస్తాయని పవన్ పేర్కొన్నారు. వీటి నిర్మాణం

- మిగతా 2లో..

## ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్" వాహనం... పార్కింగ్‌లో షో పీస్‌గా మారిందా?

### - కల్తీ నూనెపై ఫిర్యాదులు... ఫైల్ బుట్టదాకలు?
### - కలెక్టర్ కార్యాలయ సిబ్బంది వ్యవహారం.. కల్తీ మాఫియాకు సహకారం?

**తిరుపతి - ఆంధ్రనాడు:**

వందలాది కోట్ల ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు తెచ్చిన ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ మొబైల్ ల్యాబ్ వాహనం తిరుపతి కలెక్టరేట్ ప్రాంగణంలో ఓ మూలన పార్కింగ్‌లో షో పీస్ లాగా మారింది. అందులో ఒకరోజు కూడా తనిఖీ లేదా సేవా కార్యక్రమం జరగకపోవడం జిల్లా ప్రజల్లో ఆవేదన కలిగిస్తూ అధికారులపై అనుమానం పెంచుతోంది. "టెస్టింగ్, అవగాహన, శిక్షణ" అనే ఈ వాహనంపై ఉన్న పదాలు వాహనం గోడలకే పరిమితమయ్యాయి. ఈ వాహనం ఎందుకు తెచ్చారు? ఎంత ఖర్చు పెట్టారు? ఏమి పని జరుగుతోంది? అని అధికారులకే కాక కలెక్టర్‌కి కూడా ప్రజలు ప్రశ్నలు వేస్తున్నారు.

కల్తీ నూనెపై ప్రజా ఫిర్యాదు - పేరుకే "గ్రీవెన్స్ డే"? ఈ సోమవారం (జూన్ 30)న తిరుపతిలోని పలు రోడ్డు పక్క ఫుడ్ కోర్టుల్లో కల్తీ నూనె (పునర్వినియోగం, కల్పిత సువాసన కలిగిన నూనెలు) వాడుతున్నట్లు ఒక సామాజిక కార్యకర్త కలెక్టర్‌కి ప్రజా ఫిర్యాదుల సమావేశంలో ఫిర్యాదు చెసారు. టోకెన్ నెం. 440 ఇచ్చి,



"మీకు మెసేజ్ వస్తుంది" అని చెప్పారు. అయితే ఫిర్యాదు నమోదు కాలేదు. రసీదు లేదు. స్పందన లేదు. ఫిర్యాదు అదృశ్యమైందా లేక గాలిలో కలిసిపోయిందా? అనే అనుమానాలున్నాయి.: "ఫిర్యాదు నమోదు చేస్తే తప్పకుండా

- మిగతా 2లో..

## మెడికల్ స్టూడెంట్లను ఎందుకు వేధిస్తున్నారు?
### - వైసీపీ అధినేత జగన్

**అమరావతి - ఆంధ్రనాడు**



విదేశాల్లో విద్యను అభ్యసించి ఇక్కడ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్ లో ఉత్తీర్ణులైనా వారికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని వైసిపి అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వడం

- మిగతా 2లో..

## ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్" వాహనం...
# పార్కింగ్‌లో షో పీస్‌గా మారిందా?

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీ చేయాలి. శాంపిల్స్ తీయాలి. షాపులు మూయించాలి. అందుకే అధికారులు ఫిర్యాదునే పక్కన పెట్టారని భావిస్తున్నాను!" "ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్" వాహనం ఉందంతే... కానీ పని జరిగిందా? ఈ వాహనం ఉండగానే కల్తీ నూనె వాడుతున్న ఫుడ్ కార్టులను తనిఖీ చేయలేదు. మొబైల్ టెస్టింగ్ చేయడానికి ఉన్న సాంకేతిక సదుపాయాన్ని ఉపయోగించలేదు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. ఈ వాహనం వాటర్ ట్యాంక్ లారీలా నిలబెట్టేందుకో? లేక కల్తీ మాఫియా అధికార యంత్రాంగాన్ని తన గుపెట్లో పెట్టుకుందా? డాక్టర్ అయిన కలెక్టర్... ప్రజల ఆరోగ్యంపై ఫిర్యాదు చెసినా ప్రశాంతంగా ఎందుకు ఉన్నారు? కలెక్టర్ వైద్య విద్యాభ్యాసం చేసినవారిగా ప్రజల ఆరోగ్యంపై మరింత అప్రమత్తంగా ఉండాలి. కానీ, కల్తీ నూనె వాడకం, ఆహారద్రవ్యాల్లో కలుషితాలు, పునర్వినియోగ నూనె వాడకం వంటి బహిరంగ ఆరోగ్య ముప్పులకు అధికారులు మౌనం వహించడమే కాక, ఫిర్యాదులు కూడా మాయం కావడాన్ని ఎమను కోవాలి కలెక్టర్ స్వయంగా ఫిర్యాదుల ప్రాముఖ్యతను పునఃసమీక్షించి, బాధ్యులను గుర్తించాలి. "వాహనం కొనుగోలు కాదు – పని చేయించడం సర్వస్వం!" తిరుపతి నగరం – భక్తుల పాదయాత్రల తలమానికం. ఇక్కడ కల్తీ ఆహార పదార్థాలు వినియోగం జరగడం, వాటిపై స్పందన లేకపోవడం, ఆరోగ్యంపై అలసత్వం చూపడం – తిరుపతికి తలవంచే విషయం అని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పుడు అయినా కలెక్టర్ తన వైద్య నైతికతతో స్పందించి, ప్రజల ఆరోగ్యానికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని ప్రజల కోరుతున్నారు.

## ప్రభుత్వ విద్య బలోపేతం
# ఉపాధ్యాయుల బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

నిలిచారని తెలిపారు. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఇకపై విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టిసారిస్తామని తెలిపారు. ఇకపై ఉత్తమ ఉపాధ్యాయులను కలిసి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఆమె నుంచి లోకేష్ సలహాలు, సూచనలు స్వీకరించారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు అదనంగా మరో టీచర్‌ను కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రికి ఆమె చెప్పారు. 2017లో జెఎం తండా మండల పరిషత్ ఏకోపాధ్యాయ పాఠశాలకు కళ్యాణి బదిలీ అయ్యారు. ఆ సమయంలో విద్యార్థులు 14 మంది మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులుగా ఆమె సొంత నిధులతో స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. 2020–21లో విద్యార్థుల సంఖ్య 52కు పెంచారు. ఆ పాఠశాలలో విద్యనభ్యసించిన వారిలో 23 మంది విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశం పొందగా, ఒకరికి నవోదయ పాఠశాలలో ప్రవేశం లభించింది.

# బ్రిక్స్ పట్ల భారత్ నిబద్ధత !

(మొదటి పేజీ తరువాయి)

నిబద్ధతతో వుందన్నారు. ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారానికి ఇదొక కీలకమైన వేదిక అని వ్యాఖ్యానించారు. మనందరం కలిసి మరింత శాంతియుతమైన, సమానమైన, న్యాయమైన, ప్రజాస్వామ్యయుతమైన, సంతులన బహుళ ధృవ ప్రపంచవ్యవస్థ కోసం కృషి చేయాలని ప్రధాని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రెజిల్‌తో రక్షణ ఉత్పత్తి, సహకారం చేపట్టాలని భావిస్తున్నట్లు న్యూఢిల్లీలో అధికారులు తెలిపారు.
ముందుగా ఆయన ఘనాలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రామాని మహామాతో మోడీ చర్చలు జరుపుతారు. ఘనా పార్లమెంట్‌లో మోడీ ప్రసంగించనున్నారు. ఆఫ్రికన్ యూనియన్‌లో కీలక పాత్ర పోషించే ఘనా గ్లోబల్‌సౌత్‌లో చాలా విలువైన భాగస్వామి అని మోడీ వ్యాఖ్యానించారు. ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, రక్షణ రంగాల్లో పలు ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. అక్కడ నుండి ట్రినిడాడ్, టబాగో వెళతారు. టబాగో అధ్యక్షులు క్రిస్టిన్ కార్లా కంగ్లూ ఈ ఏడాది ప్రవాసి భారతీయ దివస్‌కు ముఖ్య అతిధిగా హాజరు కానున్నారు. మనందరినీ కలిపి వుంచే పూర్వీకులు, బంధుత్వాల ప్రత్యేక బంధాలను పునరుజ్జీవింపచేసేందుకు ఈ పర్యటన ఒక అవకాశం కల్పిస్తుందని మోడీ ఆ ప్రకటనలో వ్యాఖ్యానించారు. ఆ తర్వాత బ్యూనస్ ఎయిర్స్‌కు వెళతారు. 57ఏళ్ళలో అర్జెంటీనాలో పర్యటించనున్న తొలి భారత ప్రధాని మోడీ. లాటిన్ అమెరికాలో కీలకమైన ఆర్థిక భాగస్వామి అయిన అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలెతో చర్చలకు ఎదురు చూస్తున్నానని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. చివరగా నమీబియాలో పర్యటించనున్నారు.

## మెడికల్ స్టూడెంట్లను
# ఎందుకు వేధిస్తున్నారు?

(మొదటి పేజీ తరువాయి)

ఫార్మాలిటీ అయినా వేధిస్తున్నారని, ఇదేనా పరిపాలన అని విమర్శించారు. తప్పులను ఎత్తిచూపితే పోలీసులతో దాడులు చేయిస్తున్నారని, వారిపై వివక్ష చూపుతూ ఇంటర్న్‌షిప్ పేరుతో దీర్ఘకాలం చాకిరీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు మెడికల్ కళాశాలలకు లాభం కలిగిచేందుకే వీరికి రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వడం లేదని, తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని అప్పులు చేసి మరీ తల్లిదండ్రులు విదేశాల్లో చదివిస్తే వారిని అంటరానివారిగా చూస్తున్నారని ఆగ్రహించారు. అవినీతి కోసం స్కాములు చేస్తూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూడా అడ్డుకున్నారని వివరించారు. పులివెందుల మెడికల్ కళాశాలకు ఎన్ఎంసి కేటాయించిన సీట్లను కూడా వద్దని ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. తల్లిదండ్రులు, విద్యార్థులపై ఇంత పగ ఎందుకో చెప్పాలన్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి వెంటనే రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని, ఎన్ఎంసి గైడ్‌లైన్స్ ప్రకారం ఎఫ్ఎంజి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి వెంటనే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రైతులకు అండగా నిలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా నిస్సారమైన భూములకు సైతం జీవం పోయవచ్చని, భూగర్భ జలాల మట్టం పెరగడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ ఫామ్ పాండ్స్ వల్ల ఇప్పటివరకు సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరిగిందని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించినట్టు అయిందని ఆయన తెలిపారు. రైతుల సహకారంతోనే ఈ బృహత్కార్యం సాధ్యమైందని పవన్ అన్నారు. వ్యవసాయ కుంటల ఆవశ్యకతను గ్రహించి, తమ పొలాల్లో వాటిని తవ్వించుకోవడానికి ముందుకు వచ్చిన రైతులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఈ యజ్ఞంలో పాలుపంచుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి మొదలుకొని క్షేత్రస్థాయి సహాయకుల వరకు సిబ్బందికి, ఉపాధి హామీ కూలీలకు ఆయన పేరుపేరునా అభినందనలు తెలియజేశారు.

# 'మహా' బలి పశువులు కార్యకర్తలే..

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇక అసలు విషయానికి వస్తే ...ఈ దాడి నుంచి రాజకీయ పార్టీల కార్యకర్తలు ఒక విషయం గమనించాలి. పార్టీల రాజకీయ చదరంగంలో కార్యకర్తలు పావులవుతున్నారన్న నిజం గుర్తించాలి. ఈ సంఘటన సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చిందని చెప్పక తప్పదు. వివరాల్లోకి వెళితే ....

బాధ్యత లేని రాజకీయ పార్టీలు కార్యకర్తల జీవితాలతో ఆడుకుంటాయి. వారిని ముందు పెట్టి చట్ట వ్యతిరేక పనులు చేస్తుంటాయి. కార్యకర్తలు జైలు పాలవుతారు. వారి కుటుంబాలు బాధలు పడతాయి. కానీ ఎవరు రెచ్చగొట్టారో వారు మాత్రం సుఖంగా ఉంటారు. వారికి రాజకీయ లాభాలు కలుగుతాయి. న్యాయసాయం మొదట్లో చేస్తారు. కానీ కేసులు పూర్తయ్యే వరకూ కోర్టుల చుట్టూ తిరగాల్సింది మాత్రం కార్యకర్తలే.

మహాన్యూస్ పై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేయడానికి కార్యకర్తల్ని సమీకరించారు. మేమున్నామని చెప్పి వెళ్లి దాడి చేయించారు. వారిని రెచ్చగొట్టేలా కొంత మంది సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఇతర దేశాల్లో ఉంటూ..ఇక్కడి కార్యకర్తల్ని రెచ్చగొట్టారు. ఇప్పుడు ఆ కార్యకర్తలు సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను ప్రైవేటులో పెట్టుకున్నారు. కానీ ఇక్కడ వారి వల్ల చాలా మంది జైలుకెళు న్నారు. ఇప్పుడు వారి కోసం పార్టీ తరపున న్యాయ సాయం చేయవచ్చు కానీ.. కోర్టుల చుట్టూ తిరగాల్సింది మాత్రం దాడులు చేసిన వాళ్లే. ఈ విషయం కార్యకర్తలు గుర్తించాలి.

రాజకీయ పార్టీకి కార్యకర్తలు బలం. వారిని కాపాడుకోవాలి. ప్రజాస్వామ్యయుతంగా వారి బలాన్ని ఉపయోగించుకోవాలి. కానీ దారి తప్పిన రాజకీయ పార్టీలు.. వారితో తప్పుడు పనులు చేయిస్తే.. వారు కేసుల పాలవుతారు. తమ రాజకీయం కోసం వారి జీవితాల్ని నాశనం చేసినట్లవుతుంది కానీ బాగు చేసినట్లుగా కాదు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇలాంటి దాడులు చేయడం వేరు. అది రాజకీయం కోసం కాదు. కానీ ఇప్పుడు మాత్రం పూర్తిగా రాజకీయం కోసం చేస్తున్నారు. ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొట్టి కార్యకర్తలపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

రాజకీయంగా తిరుగుతూ.. పార్టీ కార్యాలయాల దగ్గరే జీవితాలను గడిపేవారు కూడా భవిష్యత్ లో పరిణామాలను అంచనా వేసుకోవాలి. తమ జీవితాలను పణంగా పెట్టే పార్టీల కుట్రల్ని అర్థం చేసుకోవాలి. ఏదైనా ప్రజాస్వామ్య రాజకీయంలో పార్టీ కోసం అండగా ఉండటం వేరు.. దాడులు .. దొమ్మీలు చేయడం వేరు. ఇలాంటివి పార్టీ ముసుగులో చేయమని ఒత్తిడి చేస్తే కార్యకర్తలు సర్దుకోవడం మంచిది. లేకపోతే కేసులు మాత్రమే మిగులుతాయి. పార్టీల నాయకులు మహా టీవీ పై దాడిలాంటి ఘటనలకు ప్రోత్సహిస్తే.. అది సరైన కాదిని గుర్తించగలిగితే ..ఇలాంటి సంఘటనలు పునరావృతం కావు.

తన కుటుంబాన్ని వీధుల్లో వేసుకుని బాగా భవిష్యత్తు నాశనం చేసుకుని బూర్జువా పార్టీలో ఇచ్చే మందు పదవులకు ఆశపడి తన జీవితాన్ని నాశనం చేసుకుంటున్న యువత గుర్తించాల్సిన అంశం ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపి శాంతియుతంగా తన భావజాలాన్ని తెలియజేసే పద్ధతులు ప్రజాస్వామ్యంలో అనేకం ఉన్నాయి అది తెలుసుకొని ముందుకెళ్లినప్పుడే యువత ,కార్యకర్తలు బాబు పడతారు. రాజకీయ రొచ్చు లోకి దిగి తన కుటుంబానికి అటు సమాజానికి రెండింటికి చెడ్డ రేవడి గ మిగిలిపోవడంలో ఇటువంటి సందేహం లేదు.

## రూ. 1292 కోట్లతో
# స్వర్ణ కుప్పం ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభకు బుధవారం ఆయన రోడ్డు మార్గాన చేరుకున్నారు. ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ బ్రాండ్ కుప్పం ఎస్టాబ్లిష్ చేస్తామని, ఇందులో భాగంగా కుప్పంలో తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తామని అన్నారు. కుప్పంలో రూ.850 కోట్లతో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. విమానాశ్రయానికి భూములిచ్చే రైతులకు మెరుగైన ప్యాకేజీ ఇస్తామన్నారు. కుప్పంలో ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానల్ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనకు తెలిసింది ప్రజాహిత రాజకీయాలు మాత్రమేనన్నారు.

రాక్షసులపై యుద్ధం చేస్తున్నానని, అభివృద్ధి, సంక్షేమ కోసం యజ్ఞం చేస్తున్నానని, యజ్ఞ ఫలితాలను ప్రజలకు అందిస్తానని పేర్కొన్నారు. తప్పు చేసే వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కుప్పంలో రూ.1292 కోట్ల రూపాయల విలువైన పనులను చేస్తున్నామని, ఇప్పటికే రూ.125 కోట్ల విలువైన పనులు కూడా పూర్తయ్యాయని, వాటిని ప్రజావేదిక నుంచి ప్రారంభించానని తెలిపారు. స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా రహదారులను సిసి, బిటి రోడ్లుగా మారుస్తున్నామన్నారు. వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌరసేవలు అందుతున్నాయని, ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లకుండానే పౌరసేవలు అందేలా వాట్సప్ గవర్నెన్సును రూపొందించామని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సమస్యకు పరిష్కారం లభించేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు.

**నాలుగు కంపెనీలతో రూ.1617 కోట్ల విలువైన ఒప్పందాలు**

అభివృద్ధి, నైపుణ్య శిక్షణకు సంబంధించి నాలుగు కంపెనీలు రూ.1,617 కోట్ల విలువైన ఒప్పందాలను చంద్రబాబు సమక్షంలో ప్రజావేదికపై కుదుర్చుకున్నాయి. వీటిలో రూ.200 కోట్ల వ్యయంతో ఇ–ఆటోలు, ఇ–బైక్స్, ఇ–స్వీపింగ్ ఎలక్ట్రిక్ మెషిన్ల తయారీ కంపెనీ, రూ.525 కోట్లతో సమీకృత పాల ఉత్పత్తులు పోషకాహార కాంప్లెక్స్ ఏర్పాటుకు ఏస్ ఇంటర్నేషనల్ సంస్థ, రూ.372.8 కోట్ల పెట్టుబడితో ఎస్‌విఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉన్నాయి. కుప్పంలోని యువతకు నైపుణ్యాభివఅద్ధి కేంద్రం ఏర్పాటు చేసి మూడేళ్లలో వెయ్యి మంది యువతకు నైపుణ్యాభివఅద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.


కాగా, చంద్రబాబునాయుడు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో తుంశి గ్రామానికి రావాల్సి ఉంది. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రోడ్డు మార్గంలో వచ్చారు. సుపరిపాలనను ప్రచారం చేస్తూ, యోగక్షేమాలను తెలుసుకుంటూ..

**– సుపరిపాలన తొలి అడుగులో భాగంగా తిమ్మరాజుపల్లిలో ఇంటింటికీ చంద్రబాబు**


శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లెలో ఇంటింటికీ ప్రచారం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి చంద్రబాబు నిర్వహించారు. సుపరిపాలన తొలి అడుగులో భాగంగా మీ ముందుకు వచ్చానన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే నెల రోజుల పాటు ఇంటింటికీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని, తాము రాష్ట్రాన్ని వికాసం వైపు నడుపుతున్నామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను గ్రామస్తులకు ఇళ్ల వద్దకు వెళ్లి వివరించారు. మొత్తం 26 ఇళ్లకు వెళ్లాల్సి ఉండగా తొలుత ఎం.నాగరాజు ఇంటికి వెళ్లారు. ఆ ఇంట్లోని వఅద్ధుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పిల్లలు ఏం చదువుకుంటున్నారని ఆరా తీశారు. త్వరలో తమ ప్రభుత్వం అమలు చేసే మిగిలిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. చదువుకుంటున్న పిల్లల గురించి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థికి ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరఫున చదివిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. తల్లికివందన పథకం ఇంట్లో చదువుకుంటున్న పిల్లలందరికీ అందిందా? అని అడిగి తెలుసుకున్నారు. అందిందంటూ తిమ్మరాజుపల్లి గ్రామస్తులు తెలిపారు. చంద్రబాబు వెంట చిత్తూరు ఎంపి దుగ్గమల్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. రాత్రి ఒంటిగంట వరకు ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం చేశారు.














## పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రామకృష్ణ



**చిత్తూరు - ఆంధ్రనాడు, జూలై 2:** చిత్తూరు జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విఆర్‌రామకృష్ణని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది వీఆర్ రామకృష్ణ చాలాకాలంగా చిత్తూరు కోర్టులో సివిల్, క్రిమినల్ కేసులలో సీనియర్ న్యాయవాదిగా విధులు నిర్వహి స్తున్నాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇతన్ని మూడేళ్ల కాల పరిమితితో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం పట్ల చిత్తూరు కోర్టుల్లోని పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాలాజీ



**చిత్తూరు - ఆంధ్రనాడు, జూలై 2:** చిత్తూరు జిల్లా ఆరవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంబాలాజీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది ఎం బాలాజీ చాలా కాలంగా చిత్తూరు కోర్టులో సివిల్, క్రిమినల్ కేసులలో సీనియర్ న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇతన్ని మూడేళ్ల కాల పరిమితితో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించింది ఈ నియామకం పట్ల చిత్తూరు కోర్టుల్లోని పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## కాణిపాక అన్నదానంలో విస్తృత తనిఖీలు

### - ఆలయ ఈవో పెంచల కిషోర్



**కాణిపాకం- ఆంధ్రనాడు జులై 2 :** కాణిపాకం అన్నదానంలో ఈవో విస్తృత తనిఖీలు. కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానం నందు తనిఖీ నిర్వహించిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , అన్నదానంలో భోజనం రుచి పై భక్తులను అడిగి వివరాలు తెలుసుకోవడం జరిగింది, భక్తులకు ప్రతిరోజు ఇదే విధమైన రుచికరమైన భోజనం అందించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో అన్నదానం ఏఈఓ ఎస్ వి కృష్ణారెడ్డి, ఈ ఈ వెంకటరమణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు బీజేపీకి అండగా నిలవాలి

### - జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు



**రామకుప్పం, ఆంధ్ర నాడు, జూలై 2:** బీసీ వర్గాలకు భారతీయ జనతా పార్టీ పెద్దపీట వేస్తున్న అనేదానికి నిదర్శనం బీసీ వర్గాలకు చెందిన పివిఎన్ మాధవని రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా ప్రకటించడం గొప్ప విషయం అని చిత్తూరు జిల్లా రాష్ట్ర ఓ బి సి నాయకుడు చిత్తూరు జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు పేర్కొన్నారు దీంట్లో భాగంగా కూటమి ప్రభుత్వం బిసి వర్గాలకు చెందిన సత్య కుమార్ యాదవ్ ను మంత్రిగా చేయడం పాక సత్యనారాయణ ను, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాజ్యసభ సభ్యులుగా నియమించడమే దీనికి నిదర్శనం అన్నారు బీసీ వర్గాలు కు మంచి గుర్తింపు ఇస్తున్న భారతీయ జనతా పార్టీకి బీసీ వర్గాలు కూడా అండగా నిలవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కుప్పం ఇంచార్జ్ తులసి నాథ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఆంజనేయప్ప, కాశీనాథ్, బిజెపి సీనియర్ నాయకులు బి. నాగరాజు, రాణి జనార్దన్ రెడ్డి ఇంకా పలువురు ఉన్నారు.

## విశ్రాంత డిఎస్పీని కలిసిన ది మదనపల్లె ప్రెస్ క్లబ్ సభ్యులు

### - విధినిర్వహణలో ఆయన సేవలు ఆదర్శనీయమని కితాబు

### - శాలువ,పూల మొక్కతో ఘనసన్మానం

**మదనపల్లి -ఆంధ్రనాడు, జులై 02:** విశ్రాంత డిఎస్పి నారాయణ స్వామి రెడ్డి బుధవారం మీడియా కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా భోజనాలు ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో తమకు సహకరించిన మీడియా మిత్రుల అభిమానాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఇందులో భాగంగా ది మదనపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నక్కింటి రవీంద్ర ఆధ్వర్యంలో విశ్రాంత డియస్పి నారాయణ స్వామి రెడ్డి అందించిన సేవలను స్మరించుకుంటూ శాలువ,పూలమొక్కను అందించి సన్మానించడం జరిగింది. అదేవిధంగా విశ్రాంత డియస్పి నారాయణ స్వామి రెడ్డి ఆహ్వానం మేరకు మదనపల్లి పట్టణంలోని పాత్రికేయ కుటుంబ సభ్యులు అందరు హాజరయ్యారు. తమ ఆహ్వానం మేరకు పిలవగానే హాజరైన పాత్రికేయులందరికి కృతజ్ఞతలు తెలిపారు.



# పండుగలా సుపరిపాలనతో తొలి అడుగు

### -ప్రజల మద్దతు కూడగట్టుకుని ఇంటింటి ప్రచారం చేస్తున్న పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్



**ఐరాల- ఆంధ్రనాడు,జున్ 2 :** ఐరాల మండలం, వడ్రాంపల్లె పంచాయతీ పరిధిలో సుపరిపాలనతో తొలి అడుగు ఇంటింటి కార్యక్రమం పండుగలా జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పూతలపట్టు నియోజకవర్గంలో బుధవారం నుండి ప్రారంభమైన సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజల మద్దతు కూడగట్టుకుని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్‌కి ప్రజలు కర్పూర నీరాజనాలతో స్వాగతం పలుకుతున్నారు. మొదటగా మిట్టిండ్లు లో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో ఊరి పొలిమేరలో అమ్మవారి విగ్రహానికి పూల మాలవేసి అమ్మవారికి పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వడ్రాంపల్లె, దామరగుంట, మిట్టిండ్లు, లింగారెడ్డి యిండ్లు గ్రామాల్లో , ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలులో ఉన్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. అనంతరం వడ్రాంపల్లె గ్రామంలో ప్రజల నుండి విన్నతులు స్వీకరించారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



తామరగుంట గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలకి ఆకస్మికంగా చేరుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్ విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యా స్థితిగతులపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో సంభాషిస్తూ ప్రభుత్వ సేవలు సకాలంలో అందుతున్నాయా అనే అంశంపై చర్చించారు. ప్రభుత్వం ప్రతి హామీని నెరవేరుస్తోందని, ప్రజల మద్దతుతోనే ఈ మార్పు సాధ్యమవుతుంది అని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షులు హరిబాబు నాయుడు, మాజీ మండల అధ్యక్షులు గురిధర్ బాబు, ఐరాల మండలం తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు, పూర్ణచంద్రారావు, కాణిపాకం ఆలయ మాజీ చైర్మన్ మనీ నాయుడు, దేవాజి, శేషాద్రి నాయుడు, రాళ్లపల్లి సురేష్, నరసింహులు నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, మరియు మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కూటమి పాలనలో

# ప్రతి కుటుంబానికి సంక్షేమాభివృద్ధి ఫలాలు

- 2వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ప్రారంభం
- ఏడాది కాలంలో రోడ్ల నిర్మాణానికి 75 కోట్లు అందించాం
- ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా



**మదనపల్లి -ఆంధ్రనాడు, జులై 02:** మదనపల్లి పట్టణం రెండవ వార్డు నందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మదనపల్లి శాసనసభ్యులు యం.షాజహాన్ బాషా మరియు మదనపల్లి నియోజకవర్గ పరిశీలకుల గాజుల శివరామ్ ప్రతాప్ తదితరులతో కలసి బుధవారం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. అనంతరం వార్డులో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అందించిన సంక్షేమ పథకాల గురించి, కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించడం జరిగింది. అలాగే ఇంకా స్థానిక ప్రజలు ఏదైనా సమస్యలు ఎదుర్కొంటున్న వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే తక్షణమే ఆయా సమస్యలపై స్పందించి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం




జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వార్డులో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు,మురికి నీటి కాలువలు మంజూరు చేయాలని సంబధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఒక ఇంట్లో తల్లికి వందనం ఇద్దరి పిల్లలకు అందడం,అదే ఇంట్లో 60 సంవత్సరాల వృద్ధురాలికి 4వేల రూపాయలు వృద్ధాప్య పెన్షన్ రావడం,సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం అ కుటుంబానికి ప్రయోజనం చేకూరిన విషయాన్ని వెల్లడించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకొని లబ్ధిపొందిన ఆనందంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు ప్రజల ముంగిటికే పాలకులు, నాయకులు, అధికారులు వెళ్లడం జరుగుతోందని చెప్పారు. బికే పల్లి నుండి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. తూర్పు స్థాయిలో కూటమి ప్రభుత్వం ప్రజలతో మమేకమై ముందుకు సాగు తొందన్నారు. ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం దత్తత తీసుకొని వారికి అన్నివిధాలుగా ఆదుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. పిల్లల నుండి వృద్ధుల వరకు అందరికి లబ్ది కల్గించడంతోపాటు అన్నా క్యాంటిన్ ద్వారా ఐదు రూపాయలకే భోజనం అందిస్తున్న చరిత్ర కూటమి ప్రభుత్వానిదేనన్నారు. వాట్సాప్ ద్వారానే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, మరో వైపు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పనులు పూర్తి అవుతున్నాయని,రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం మొదలైందని సిఎంఆర్ఎఫ్ చెక్కులు ప్రతివారం లబ్ధిదారులు ఇంటికి వెళ్ళి పంపిణి చేస్తున్నాని వివరించారు. ఆగష్టు నుండి పూర్తి స్థాయిలో మహిళలకు ఉచిత బస్సుప్రయాణం అమల్లోకి వస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నప్పటికీ ప్రతినెల ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లిస్తూ,ఒకటవ తారీఖునే పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని కితాబునిచ్చారు. మొదటి ఏడాదిలోనే మదనపల్లికి 75 కోట్లు రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రబల్లి వెంకట రమణా రెడ్డి,బొమ్మిశెట్టి పురుషోత్తం,డాన్స్ రెడ్డెప్ప,తోపాటు పెద్దఎత్తున తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# మంత్రిని కలిసిన భువనేశ్వరి సత్య

**మదనపల్లి -ఆంధ్రనాడు, జులై 02:**
ఏపీ వైద్యఆరోగ్యశాఖ మంత్రిసత్యకుమార్ యాదవ్‌ని బుధవారం విజయవాడలో అన్నమయ్య జిల్లా,మదనపల్లి పట్టణానికి చెందిన బిజెపి నాయకులు భువనేశ్వరి సత్య,జబ్బల శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా మంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి సత్య మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖను మంత్రి సత్యకుమార్ సమర్థవంతంగా నిర్వహి స్తున్నాంన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయాల మేరకు ఆయన పని చేస్తున్నారని కొనియాడారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకోవడంతో మదనపల్లి నియోజకవర్గంలో తాము నిర్వహించిన కార్యక్రమాలను మంత్రికి వివరించగాప్రశంసించారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారన్నారు. అదేవిధంగా మంత్రి మమ్మలని ఎంతో ఆప్యా యంగా పలకరించారని భువనేశ్వరి సత్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గోకుల్ తదితరులు పాల్గొన్నారు.



# బేదాభిప్రాయాలు వీడి..ఐకమత్యంతో పనిచేయండి

**-గ్రూపు రాజకీయాలతో నష్టపోయేది మనమే**
**-సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని అందరం కలసి విజయవంతంగా పూర్తి చేద్దాం**
**-కలసి కట్టుగా సంస్థాగత ఎన్నికల్లో విజయ దుందిబి మొగిద్దాం**
**-మండల పరిశీలకులు అర్జే వెంకటేష్**



**తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, జూలై 02:** తంబళ్లపల్లిలో టీడీపీ శ్రేణులు బేదాభిప్రాయాలు వీడి ఐకమత్యంతో పనిచేయాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి, టీడీపీ మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకులు అర్జే వెంకటేష్ సూచించారు. బుధవారం ఆయన టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబుతో కలసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ..సొంత పార్టీలో అందులోనూ క్రమ శిక్షణకు మారు పేరైన టీడీపీలో వర్గాలకు తావు లేదన్నారు. అధిష్టానం ట్రబుల్ షూటర్‌గా నన్ను తంబళ్లపల్లికి పంపారని.. ఎవరికి ఏ సమస్యలున్నా తమకు తెలియాలని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం కూటమి విజయ దుందుబి మోగించిందని.. తంబళ్లపల్లిలో టీడీపీ బలంగా ఉన్నా గ్రూపు రాజకీయాల కారణంగా ఓటమి పాలయ్యిందన్నారు. ఇకనైనా టీడీపీలో వర్గాలు వీడి సమిష్టిగా పనిచేసి గ్రామ స్థాయిలో టీడీపీని మరింత బలోపేతం చేసి సంస్థాగత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. గత ఐదేళ్లలో వైసీపీ అరాచకాలను ఎదుర్కొని తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి కష్టించి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందని పరిశీలకులు వివరించారు. కార్యకర్తల సూచనల మేరకే అదిష్టానం మండల కమిటీ, అధ్యక్షుడి నియామకం చేపడుతుందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని సుపరిపాలన–తొలి అడుగు కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం టీడీపీ నాయకులు, పురుషోత్తం, సిద్ధారెడ్డి, రేపన బాబు, కాలా నారాయణ, బోయపల్లె శివ వెంకటేష్, మధుబాబులను దుస్సాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తదనంతరం కార్యకర్తల అబిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలఘువారాహి దేవి

# అలంకరణలో భక్తులకు దర్శనం

**రామచంద్రాపురం–ఆంధ్ర నాడు,జూలై 2:**

రామచంద్రాపురం మండలంలోని రాయల చెరువు కట్టకు ఈశాన్య సరిహద్దులో, సిద్దుల పర్వతానికి పాదపీఠంలో వెలసి వున్న శ్రీ శక్తి పీఠం నందు శ్రీ వారాహీ దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా బుధవారం శ్వేత వారహీదేవి శ్రీలఘు వారాహి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వారాహి దేవి నవరాత్రి బ్రహ్మోత్సవాలు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతీ మహాస్వాముల వారి శుభ ఆశిస్సులతో, శ్రీశక్తి పీఠాదీశ్వరి మాతాజీ రమ్యానందభారతీ స్వామిణి ఆధ్వర్యంలో అంగరంగ వైభవముగా జరుగుతున్నాయి. ఉదయం 10 గంటలకు రాయల చెరువు పేట గ్రామానికి చెందిన మండల టిడిపి అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి,మాధవి రెడ్డి దంపతులు కార్యక్రమానికి ఉభయ దారులుగా వ్యవహరించారు. వారి ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, డప్పులు వాయిస్తూ,బాణా సంచాలు పేలుస్తూ గ్రామం నుండి ఊరేగింపుగా సారె,







పొంగళ్లను తీసుకొచ్చి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిణి అందజేశారు, వారాహి అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి,పట్టు వస్త్రాలు కట్టబెట్టి బంగారు ఆభరణాలు,వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, ఓం శక్తి నామ స్మరణల నడుమ ప్రత్యేక పూజలు,హెూమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ లఘు వారాహీ దేవికి దర్బారు సేవ నిర్వహించారు. ఏడవ రోజైన బుధవారం 7000 మంది పైగా భక్తులు రావటంతో అమ్మవారి ఆలయం భక్త జనసంద్రంగా మారింది. భక్తులు శ్రీవారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ శక్తి పీఠం నిర్వాహకులు భక్తులందరికీ తీర్థప్రసాదాలు, పసుపు, కుంకుమ, పసుపు దారాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయల చెరువు పేట గ్రామస్తుల తో పాటు, కార్యనిర్వహకులు శ్రీకాంత్, ప్రసాద్, సుధారాణి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు కోలా ఆనంద్ అభినందన



**శ్రీకాళహస్తి – ఆంధ్రనాడు , జూలై 02 :** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన పోకల వంశీ నాగేంద్ర మాధవ్ ను బుధవారం విజయ వాడలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ బీజేపీ శ్రీకాళహస్తి అసెంబ్లీ కన్వీనర్ కోలాఆనంద్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి దుశ్యాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాధవ్ నాయ కత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి కోసం తమవంతు కృషి చేసి విజయవంతం కావాలని కోరారు.

## అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి


**-ఎస్ఐ ఉమా మహేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేసిన జనసేన నాయకులు**



**తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, జూలై 02:** ఏపీ డిప్యూటీ సీఎం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ.. సోషల్ మీడియాలో అసభ్యకరమైన మాటలు.. మార్ఫింగ్ ఫొటోలతో పోస్టులు పెడుతున్న కన్నెమడుగు సురేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేయాలని జనసేన నాయకులు తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. జనసేన ఇంచార్జ్ పోతుల సాయినాథ్ ఆదేశాల మేరకు..బుధవారం టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ బేరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసేన మండల నాయకులు ఎద్దుల నరసింహులు, పవన్ రెడ్డి,మనోహర్, సోమశేఖర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డిలు ఎస్ఐ ఉమా మహేశ్వర్ రెడ్డిని కలసి డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## గరుడ వాహనంపై ఊరేగిన శ్రీ కల్యాణ వేంకన్న

**- నేడు పార్వేట ఉత్సవం**





**చంద్రగిరి–ఆంధ్రనాడు,జూలై2:**

చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురంలో కొలువుతీరి ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై వూరేగి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాల, కొలువు,పంచాంగ శ్రవణం,సహస్ర నామార్చన సేవలు నిర్వ హించారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఊంజల్ సేవ చేపట్టారు. సాయంత్రం 06 గంటలకు ఉత్సవ మూర్తులను వాహన మండపంలోకి వేంచేపు చేశారు. సాయంత్రం 6.30 గం.లకు లక్ష్మీ హారాన్ని ఆలయ ప్రదక్షిణగా అలంకార మండపంలోకి తీసుకువచ్చి స్వామి వారిని అలంకరించారు. రాత్రి 7 గంటలకు గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. స్వామి వారి వాహన సేవ ముందు భజన భక్త బృందం వివిధ రకాల వేషధారణలతో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్,ఆర్జితం ఇన్స్పెక్టర్ ఆనంబట్టు ధనశేఖర్,అర్చకులు,ఇతర అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **నేడు పార్వేట ఉత్సవం:** గురువారం ఉదయం 07 – 11 గంటల వరకు ఉత్సవ మూర్తులు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11.00 – 02.00 గం.ల మధ్య పార్వేట ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆస్థానం, వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



## ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం

**పలమనేరు–ఆంధ్రనాడు,జూన్ 02:** పలమనేరు శాసనసభ్యులు అమరనాథరెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కుప్పం నియోజకవర్గ పర్యటన నిమిత్తం వి.కోట మీదుగా వెళ్తున్న ఆయన అక్కడి ఎగువ చెక్ పోస్ట్ నందు తన కాన్వాయ్ ను కొద్దిసేపు ఆపారు. ఈ సందర్భంగా పలమనేరు ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలను తెలియజేశారు.

**పలమనేరు పట్టణంలో:** పట్టణ మందలి టీడీపీ కార్యాలయంలో అమరనాథ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పుష్పగుచ్చాలు, బొకేలు, పండ్ల బొకేలు అందించి దూశాలువలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అధికారులు కూడా అమరనాథ్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. అంతకు మునుపు వేదపండితులు హాజరై అమరనాథ రెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమం ఉదయం ఏడు గంటలు నుంచే ప్రారంభం కావడం విశేషం.

## ఎన్ అమర్నాథ్ రెడ్డికి ఘనంగా జన్మదిన వేడుకలు





**పుంగనూరు –ఆంధ్రనాడు, జూలై 2:** రాష్ట్ర మాజీమంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత నూతన కాలువ అమర్నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను పుంగనూరు, పలమనేరు, మదనపల్లి 3 నియోజకవర్గాలలో ఆయన అభిమానులు ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు, ఈ సందర్భంగా , అమరనాథ్ రెడ్డి అభిమానులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ఎదురులేని నాయకుడుగా పేరు గడించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఒక అన్నగా పిలవబడే మాజీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిత్తూరు జిల్లా మాజీ ఎంపీ, నూతన కాలువ రామకృష్ణారెడ్డి తనయుడు రాజకీయ దురంధరుడు నూతన కాలువ అమర్నాథ్ రెడ్డికి జన్మదిన వేడుకలను నిర్వహించి, అమర్నాథ్ రెడ్డి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని రాజకీయాలలో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకలియుగ వెంకటేశ్వర స్వామిని కోరుకుంటూ, అమరనాథ్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు , అదేవిధంగా అమర్నాథ్ రెడ్డి ,అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలు కొనసాగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలను నెరవేర్చి , ప్రభుత్వం పతకాలను ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో అమర్నాథ్ రెడ్డి అభిమానులు , తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యం

**- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**



**శ్రీకాళహస్తి – ఆంధ్ర నాడు , జూలై 02 :** టిడిపి తోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు . తోటంబేడు మండలంలోని చిన్న సింగమల గ్రామంలో బుధవారం “సుపరిపాలనలో తొలిఅడుగు” డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి పాలనను పారదర్శకంగా నేరుగా చేర్చేందుకు ఈ కార్యక్రమం ఒక విశేషమైన ప్రయత్నంగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజనరీ నేతృత్వం, యువకుడు, ప్రతిభావంతుడైన ఐటి మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలోనే ఇది సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం రాష్ట్రం మరియు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఒక సంవత్సరం కాలంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించే కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, ఎంపీడీవో సురేంద్రనాథ్, పంచాయతీ కార్యదర్శి శరత్ శాంతన్ కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజా నాయుడు, నియోజవర్గ పరిశీలకుడు అంకయ్య చౌదరి, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, దశరథ ఆచారి, చెంచయ్య నాయుడు, జయచంద్ర నాయుడు, కన్నలి ప్రతాప్ రెడ్డి, కొన్నలి రమేష్,గుర్రప్ప, కుమారస్వామి,కమల్, సునీల్ , గోపి, చంద్రారెడ్డి, భాస్కర్ నాయుడు , భాస్కర్ తదితరులు పాల్గొన్నారు .

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733

## క్యాన్సర్ బాధిత బాలుడికి రూ.10 వేలు ఆర్థిక సాయం



**చౌడేపల్లి – ఆంధ్రనాడు, జూలై 02:** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థి షాహిద్ ను మాజీ మంత్రి ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సహాయం చేసి ఆదుకొన్న ఘటన మంగళవారం చోసుచేసుకుంది వివరాలిలా ఉన్నాయి. చౌడేపల్లె గడ్డంవారిపల్లె రోడ్డులో గల జగనన్న కాలనీలో నివాసమున్న షాజహాన్, నౌహీరాలకుమారుడు షాహిద్ ఇటీవల పదోతరగతి 472 మార్కులు సాధించి పాసైయ్యాడు. 2024 డిసెంబర్‌లో ఇంటి వద్ద కబడ్డీ ఆడుతుండగా జారిపడడంతో కుడి చెయ్యికు గాయమైంది. తేలికగా అనుకొన్న అతడికి చేదు అనుభవం ఎదురైంది. నొప్పి అధికంగా కావడంతో పుంగనూరు, మదనపల్లె, తిరుపతి లో వైద్యసేలందించినా ఫలితంలేకపోవడంతో వైద్యుల సూచనల మేరకు బెంగళూరు కొలంభియా ఆసుపత్రికి వెళ్ళారు. అక్కడి వైధ్యులు పరీక్షలు నిర్వహించి బోన్ క్యాన్సర్‌గా నిర్ధారించారు. కార్పెటర్‌గా కూలీ పనులు చేస్తున్న తండ్రి సుమారు రూ:2 లక్షలు పైగా ఖర్చుచేశారు. ప్రస్తుతం కీమోథెరఫి చేస్తున్నట్లు తెలిపారు. పేదరికంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అతడు వైఎస్సార్‌సీపీ, జిల్లా ఉప్యాధ్యక్షుడు ఎన్.దామోదరరాజు, దృష్టికి తీసుకెళ్ళారు. మాజీమంత్రి సహకారంతో మంజూరైన రూ:10 వేలు నగదును బాధితుడి తల్లితండ్రులకు అందజేశారు. ఇంకనూ ఆసుపత్రికి అయ్యే ఖర్చును ఎంపీ పివి. మిథున్‌రెడ్డి సహకారంతో పీఎం రిలీఫ్ పండ్‌తోపాటు తమ సహకారంతో చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు. ఆర్థిక చేయూత నిచ్చిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, దామోదర రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్తాఫ్ ఉన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



**సత్యవేడు – ఆంధ్రనాడు, జూలై 02:** సత్యవేడు మండలం మధనంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విమల ఆధ్వర్యంలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీల్లో భాగంగా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇరుగుళంకు బదిలీ అయిన చిన్నబాబు, ఆంగ్ల ఉపాధ్యాయులు గోపి నాగరాజు, సోషల్ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పిడి స్వర్ణ, స్పెషల్ ఎడ్యుకేషన్ దయ తదితరులకు ఉపాధ్యాయ బృందం పూలమాలవేసి సాలువతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు బోధన, విద్యా ప్రగతి తదితర అంశాలపై బదిలీ అయిన ఉపాధ్యాయులు చేసిన సేవలు ఎనలేనివని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విమల కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తారకరామ నగర్‌లో డ్రోన్ల నిఘా



**రేణిగుంట – ఆంధ్రనాడు, జూలై 02:** రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామ నగర్ లో రేణిగుంట పోలీసుల ఆధ్వర్యంలో డ్రోన్ల నిఘా నిర్వహించారు. తిరుపతి ఎస్పీ ఉత్తర్వులు మేరకు గంజాయి తాగే వారిపై ఉక్కి పాదం మోపాలనే సంకల్పంతో బుధవారం రేణిగుంట పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో తారకరామా నగర్, కరకంబాడి గ్రామంలో డ్రోన్స్ సహాయంతో గంజాయి మరియు బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే ప్రదేశాలపై నిఘా ఉంచడమైనది. ఈ కార్యక్రమంలో రేణిగుంట డిఎస్పి వై శ్రీనివాసరావు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ జయచంద్ర, సబ్ ఇన్స్పెక్టర్ అరుణ్ కుమార్ రెడ్డి, తిరుపతి స్పెషల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## లఘు వైష్ణవి దేవిగా అలంకరణ



**చౌడేపల్లి – ఆంధ్రనాడు, జూలై 02:** చౌడేపల్లి మండలం పుదీపట్లలో వెలసిన స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో 7 వ రోజు శ్రీ లఘు వైష్ణవి అలంకారంలో దర్శనమిచ్చింది. అమ్మవారిని దర్శించుకున్న వారికి భయ నివారణ రక్షణ విజయం భూ గృహ సమస్య పరిష్కారం జరుగును. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం చేస్తారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ రెడ్డి, తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఉభయదారులుగా పుంగనూరుకు చెందిన రామస్వామి రెడ్డి, ధర్మపత్ని మాధవిలు ఉభయ దారులుగా వ్యవహరించారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే పులివర్తి నాని
- మంచి ప్రభుత్వం ఆశీర్వదించండి
- తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, జూలై 02:** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చంద్రగిరి నియోజకవర్గంలో ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి కలసి బుధవారం తిరుపతి రూరల్ మంగళంలో ప్రారంభించారు. ముందుగా మంగళంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల నగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌లో 27 లక్షల రూపాయలతో నూతనంగా వేసిన సిసి రోడ్డును ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వివరాలు చంద్రగిరి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనుల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేసే గత పాలనకు ప్రస్తుత పాలనకు ఉన్న తేడాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఏడాది పాలనలోని ప్రజలకు మార్పు చూపించామన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో అన్నిటిని అమలు చేస్తున్నామన్నారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అనేక మార్పులను తీసుకువచ్చామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు మంత్రి లోకేష్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలు ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరితోందని ఎలాంటి దౌర్జన్యాలు, రౌడీయిజం లేకుండా ప్రజల ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని ప్రజలు ఆశీర్వదించలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను పారదర్శకంగా నిర్వహించాలి



**చంద్రగిరి – ఆంధ్రనాడు, జూలై 02:** ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తిరుపతి జిల్లా విద్యశాఖాధి కెవియన్ కుమార్ అన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా విద్యాశాఖాధికారి చాంబర్‌లో బుధవారం జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలతో అడ్మిషన్ల ప్రక్రియపై అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలు గల ప్రాస్పెక్టర్స్‌ని అన్ని అధ్యయన కేంద్ర సమన్వయకర్తలకు అందించారు. గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఓపెన్ స్కరీల్ అడ్మిషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసువులు చేయాలని చెప్పారు. అధికారులు అందించిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ అధ్యయన కేంద్రమైనా అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నట్లు పిర్యాదులు వస్త్త ఆ కేంద్రం పైన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ లక్ష్యాన్ని చేరుకోవడంలో అందరి కృషి అవసరమన్నారు. అధ్యయన కేంద్రాల పరిధిలో రెగ్యులర్ పది, ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయి వున్న విద్యార్థుల వివరాలను సేకరించి, వారిని సంప్రదించి ఓపెన్ స్కూల్ లో అడ్మిషన్ పొందేటట్టు కృషి చేయాలని తెలియజేశారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు కూడా రెగ్యులర్ పాఠశాల సర్టిఫికెట్లతో సమానమైనవని విస్తృత స్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరో కొందరు చేసే పొరపాట్ల వలన వ్యవస్థకు చెడ్డ పేరు రావటం సరికాదన్నారు. ఓపెన్ స్కరీల్‌లో చదవటానికి, రాయటానికి కనీస విషయ పరిజ్ఞానం వున్న వారినే అడ్మిషన్ చేసుకోవడం మంచిదని సూచించారు. అడ్మిషన్ కోసం వచ్చిన విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రవేశం ఇవ్వాలన్నారు. అడ్మిషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఓపెన్ స్కరీల్ నడపటం సామాజిక సేవా కార్యక్రమంగా డీఈఓ అభివర్ణించారు. అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలు జాతి నిర్మాణంలో భాగస్వాములన్న సంగతి మరువకూడదని హితవు పలికారు. అడ్మిషన్ల సందర్భంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా చూడాలని కోరారు. పుస్తకాలు, సర్టిఫికెట్లు అభ్యర్థనలకు పోస్టులో పంపుతున్నారని, దీని వలన పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. అడ్మిషన్లు సమయం మరింతగా పెంచాలని అధ్యయన కర్తలు అధికారుల దృష్టికి తెచ్చారు. గత విద్య సంవత్సరంకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇంకనూ కొంతమందికి రాలేదని అధికారులకు తెలిపారు. ఓఫెన్ స్కరీల్స్ పరీక్షలు జరిగే సమయంలో ఇతర పోటీ పరీక్షలను నిర్వహించ కుండా చూడాలని కోరారు. సర్టిఫికెట్ల పంపిణీని పరిశీలించు కోవటానికి సులభతరంమైన ట్రాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసామని చెప్పారు. అందరి దృష్టి ఓపెన్ స్కూల్స్ పై ఉన్నదని దానికి తగ్గట్టుగా సమన్వయకర్తలు మసలు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కేంద్రానికి మార్గదర్శకాలతో కూడిన ప్రస్పెక్టర్స్ అందించామని, వాటిని అనుసరించి అడ్మిషన్లు చేయాలన్నారు. రాష్ట్ర ఓపెన్ స్కరీల్స్ సొసైటీ సమన్వయ కర్త నరసింహారావు మాట్లాడుతూ అధ్యయన కేంద్రాల సమన్వకర్తల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిస్కరించటానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ గురుస్వామి రెడ్డి, తిరుపతి జిల్లా లోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలు, జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# టీటీడీలో ఉద్యోగులకు తీరని అన్యాయం

- పాలక మండలికి రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి
- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య



**తిరుపతి ప్రెస్ క్లబ్ – ఆంధ్రనాడు, జూలై 02:** తిరుమల తిరుపతి దేవస్థానంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల ఉద్యోగులకు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతూనే ఉన్నది. దీనికి ప్రధాన కారణం పాలకమండలి చైర్మన్, సభ్యులకు రాజ్యాంగంపై అవగాహన లేకపోవడమే..? తిరుపతి "శ్వేత భవన్" లో టిటిడి ఉద్యోగులకు అవగాహన కల్పించడానికి ట్రైనింగ్ ఇస్తున్నట్లుగా, పాలక మండల కి న్యాయ నిపుణుల చేత రాజ్యాంగంపై అవగాహన కల్పించుటకు రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య సూచించారు. టీటీడీ రాజ్యాంగ పరిధిలోకి వచ్చి 90 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సూచించినప్పటికీ టీటీడీ బాధ్యతారహితంగా ఉన్నది. అందులో భాగమే సిమ్స్ వార్డ్ బాయ్స్ చేస్తున్న నిరాహార దీక్షలు, అదేవిధంగా లక్షలాది మంది భక్తుల మురికిని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు పెరుగుదల దేవుడెరుగు, చేసే పని ద్వారా వచ్చే రోగాల నుండి తప్పించుకోవడానికి కనీస అవసరాలు, మురుకిచేతులు కడుక్కోవడానికి సోపులు, కాళ్ళకు చెప్పులు, చేతులకు బ్లౌజులు, సరఫరా చేయవలసి ఉన్నప్పటికీ టీటీడీ పట్టించు కోవడం లేదు. శ్రీవారి మెట్టు మార్గాన 30 ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న 30 కుటుంబాలను పులులు సంచరిస్తున్నాయని సాకుతో ఖాళీ చేయించడం జరిగింది గత మూడు వందల రోజులుగా టీటీడీ పరిపాలన భవనం ముందు కుటుంబాలతో సహా నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ పిలిసి, చర్చించిన దాఖలాలు లేవు ఎస్సీ, ఎస్టీ,లకు రాజ్యాంగబద్ధంగా భర్తీ చేయవలసిన బ్యాక్ లాగ్ ఉద్యోగాలు నింపకుండా కాలయాపన చేస్తుండడం అత్యంత బాధాకరం. టీటీడీ యాజమాన్యం తచ్చణం స్పందించి పై తెలియజేసిన న్యాయమైన సమస్యలపై పరిష్కరించడానికి సత్వరం నిర్ణయం తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ద్వారా డిమాండ్ చేశారు.

## ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్లుగా సూర్య ప్రకాష్, చిరంజీవి




**సత్యవేడు – ఆంధ్రనాడు, జూలై 02:** సత్యవేడు మండలంలో సత్యవేడు స్టేట్ బ్యాంక్ మేనేజర్గా సూర్య ప్రకాష్, రాళ్లకుప్పం స్టేట్ బ్యాంక్ మేనేజర్గా చిరంజీవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బ్యాంకు మేనేజర్లు బదిలీ కావడంతో బ్యాంకు ఉన్నతాధికారులు కొత్తవారిని నియమించారు. ఈ నేపథ్యంలో సత్యవేడు ఎస్బిఐ మేనేజర్గా బాధ్యతలు చేపట్టిన సూర్య ప్రకాష్ హైదరాబాదు నుంచి బదిలీపై ఇక్కడికి రాగా, రాళ్ల కుప్పం ఎస్బిఐ మేనేజర్గా బాధ్యతలు స్వీకరించిన చిరంజీవి శ్రీకాళహస్తి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా సత్యవేడు ఎస్బిఐ మేనేజర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం తమ బ్యాంకు 187 కోట్ల రూపాయల టర్నోవర్ ఉందన్నారు. ఇందులో 120 కోట్లు రుణాలు, 60 కోట్లు డిపాజిట్లు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. సెలవు రోజుల్లో ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా ఏటీఎం మిషన్లు నగదు ఉండేటట్టు చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**- మోసపూరిత వాగ్దానాలతో ప్రజలకు వెన్నుపోటు**
**- జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి**




**కార్వేటి నగరం – ఆంధ్రనాడు, జూలై 2:** సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ప్రజలకు హామీలు ఇవ్వడం తప్ప వాటిని గెలిచాక అమలు చేసే పరిస్థితి లేదని,బాబు సంపద సృష్టించి ఎప్పుడు అభివృద్ధి చేస్తాడని వైఎస్ఆర్సిపి పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లి మిట్టలోని ఓ కళ్యాణ మండపంలో చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకుతెస్తూ అనే కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గం ఇంచార్జ్ కృపా లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా కరుణాకర్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గతంలో జగన్ అందిస్తున్న పథకాలతో పాటు సూపర్ సిక్స్ తో పాటు 143 హామీలను ఇచ్చి ప్రజలకు వాటిని అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. ఏడాది గడుస్తున్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంపై చంద్రబాబుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సంవత్సరం గడుస్తున్న ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి చంద్రబాబు అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజల్లోకి స్కానర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క నాయకులు కార్యకర్తలు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రాజు,జిల్లా ఉపాధ్యక్షులు గురవారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ చందు రాజు, జడ్పిటిసి సుకుమార్, మునికృష్ణ, నందగోపాల్, రాజా, పట్టాభి రెడ్డి, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అట్టహాసంగా సుపరిపాలనతో తొలి అడుగు

**- నియోజకవర్గం అభివృద్ధికి ఏడాదిలో దాదాపు 132 కోట్లు మంజూరు**



**బంగారుపాళ్యం – ఆంధ్రనాడు, జూలై 2:** చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండలం, సంక్రాంతిపల్లె గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సుపరిపాలనతో తొలి అడుగు" ఇంటింటి ప్రచారంలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. మండల నాయకులు, స్థానిక నాయకులు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.అనంతరం సుపరిపాలలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటి వెళ్ళి ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పూతలపట్టు నియోజకవర్గం అభివృద్ధికి దాదాపు రూ.132 కోట్ల రూపాయలు మంజూరు అయ్యిందన్నారు. ఇంత వరకూ ఎవరూ చేయని అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు ఏడాదిలోనే చేయడం సంతోషంగా ఉందన్నారు.అదే విధంగా నారా లోకేష్ యువగళంలో ఇచ్చిన హామీ మేరకు బంగారుపాళ్యం మండల కేంద్రంలో రోగుల సహాయార్ధం డయాలసీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒకే ఏడాదిలో కూటమి ప్రభుత్వం దాదాపు నెరవేర్చుతోందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక చేయూత అందుతుందన్నారు. అలాగే ఆగస్టు15 నుండి మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, పించన్ రూ.4000, తల్లికి వందనం, తదితర సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం ఆచరణలో పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం పరిశీలకులు బొమ్మన శ్రీధర్, గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిశీలకులు ఎన్.పి.జయప్రకాష్ నాయుడు, స్థానిక సర్పంచ్ రమేష్, హరిబాబు, ఎన్.పి రాధాకృష్ణ, సూరి, లోకేష్ రెడ్డి, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్.పి.ధరణీ నాయుడు, మండల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల్లో నిరాశ... నిస్పృహ..



**రాజమండ్రి– ఆంధ్రనాడు:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, రైతులకు ఇచ్చిన హామీలు ఇంకా కాగితాల్లోనే మిగిలిపోవడంతో ఆంధ్రప్రదేశ్లో రైతాంగం తీవ్ర నిరాశ, నిట్టూర్పులతో అలమటిస్తోంది! వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యాన్ని బట్టి చంద్రబాబు మునుపటి వైఖరి మారలేదనే స్పష్టమౌతోంది. కూటమిలో తెలుగుదేశంతో పాటు జనసేన, బీజేపీలు చేరి ఇచ్చిన ఎన్నికల ఉమ్మడి హామీల అమలుకూ రైతాంగం నోచుకోవడం లేదు. హామీల మేరకైనా వ్యవసాయ సమస్యల్ని తీర్చి చరిత్ర గతిని మారుస్తారా? ఇదే నిర్లక్ష్యం కొనసాగించి చరిత్రహీనులుగా మిగులుతారా? అని ఏపీ రైతాంగం ప్రశ్నిస్తోంది.సూపర్ సిక్స్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గొప్పగా చెప్పిన హామీలు రైతులకు గుర్తున్నాయి.

ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20,000 పెట్టుబడి సాయం ఇస్తామని "అన్నదాత సుఖీభవ" పథకాన్ని కూటమి పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాయి. కానీ, ఏడాది గడిచినా ఈ హామీ నెరవేరలేదు. రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. ఏడాదిలో 143 హామీలు నెరవేర్చామని కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు, కానీ రైతులకు సంబంధించిన హామీలు ఎన్ని నెరవేరాయి? అనే ప్రశ్నకు సమాధానం.. సున్నా! "మీరు ఇచ్చిన మాట ప్రకారం రూ.20,000 ఎప్పుడు ఇస్తారు?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి గ్రామంలో రైతులు ఈ హామీని గుర్తు చేస్తూ, తమ ఖాతాల్లో డబ్బు జమ చేయాలని కోరుతున్నారుకేవలం ధాన్యం సేకరణ విషయంలో మాత్రం కూటమి ప్రభుత్వం పట్ల రైతులు సంతృప్తిగా ఉన్నారు. పీపుల్స్ పల్స్ సర్వేలో రైతులు చెప్పినట్లు, ధాన్యం సేకరణ తర్వాత నగదు చెల్లింపులు వెంటనే జరుగుతున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం 55,57,525 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. 8,50,342 మంది రైతులకు రూ.13,584 కోట్ల చెల్లింపులతో పాటు, గత ప్రభుత్వం బకాయి పడిన రూ.1674 కోట్లు కూడా చెల్లించింది. ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఫిర్యాదూ లేదు. కానీ, రైతుల సమస్యలు కేవలం ధాన్యం సేకరణతోనే ముగిసిపోతాయా అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధర, నీటి సౌకర్యం, ఉచిత బీమా, అన్నదాత సుఖీభవ ఎప్పుడని వారడుగుతున్నారు.'సూపర్ సిక్స్' పేరిట రైతులకు ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, పాడి రైతులకు రూ.2 లక్షల సబ్సిడీతో షెడ్డుల నిర్మాణం వంటివి చేస్తామని కూటమి పార్టీలు ఎన్నికల్లో ప్రకటించాయి. ఇప్పుడు అవి అమలవుతున్నాయని రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ చెప్పలేదు. 60 లక్షలకు పైగా ఉన్న పాడి రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కూటమి నెరవేర్చలేదు. "మాకు షెడ్డులు ఎక్కడ? డ్రిప్ పరికరాలు ఎక్కడ?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగితాలకే తప్ప ఇవేవీ గ్రామాలకు చేరలేదని స్పష్టమవుతోంది.అటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి కూడా రైతుల కంటే కంప్యూటర్లు, కంపెనీలే ముఖ్యమని అధిక శాతం రైతులు అభిప్రాయపడ్డారు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు కౌలు రైతుల సమస్యలపై గళమెత్తారు. కానీ, అధికారంలోకి వచ్చాక కౌలు రైతుల గురించి మాట్లాడటం మానేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "పవన్ కళ్యాణ్ సినిమాల గురించి, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారు, కానీ రైతుల గురించి ఒక్క మాటా లేదు!" అని ఆకువీడులో ఓ రైతు అన్నాడు. "కౌలు రైతుల కోసం పవన్ ఏం చేశాడు?" అని సత్తెనపల్లిలో జనసేన సానుభూతి పరుడైన శ్రీనివాస్ అనే రైతు ప్రశ్నించాడు.కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్ అప్పుడప్పుడూ రైతుల సమస్యలపై మాట్లాడినా, అవి అరణ్య రోదనలుగా మిగిలిపోతున్నాయి. ఉద్యమ తరహాలో కార్యక్రమాలు లేవు. "కమ్యూనిస్టు అనుబంధ రైతు సంఘాలు రైతు సమస్యలపై మాట్లా డుతున్నా... వారి బలం సరిపోవడం లేదు. వారు లేవనెత్తిన అంశాలు వినే నాథుడే లేరు!" అని కమ్యూనిస్టు రైతు సంఘ నాయకుడు జమలయ్య చెప్పారు.ఏడాది కాలంగా, ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు, తుఫాన్లతో నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వకుండా చేతులు దులుపుకుంది. ఉచిత పంట బీమా పథకాన్ని కూడా ఎత్తివేయడంతో రైతులకు నష్టపరిహారం అందకుండా పోయింది. పెసర, శెనగ, మినుములు, కంది వంటి పంటలకు పెట్టిన పెట్టుబడి వెనక్కి రాక, రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం పెసరకు రూ.8682, మినుములకు రూ.7400, ఎర్ర శెనగలకు రూ.5440 మద్దతు ధరలు ప్రకటించినా అవి రైతులకు అందడం లేదని పరిశీలనలో వెల్లడయ్యింది. వ్యాపారులు, దళారులు కనీసం రూ.1500 తక్కువకు కొంటున్నారని రైతులు ఆందోళనగా చెబుతున్నారు. కనీస మద్దతు ధర అమలు చేయించే వ్యవస్థ లేదు. ప్రభుత్వానికి ఇది పట్టడం లేదు.కౌలు రైతుల కోసం ఎన్నికల ముందు కూటమి అనేక హామీలు ఇచ్చింది. కొత్త కౌలు చట్టం తెస్తామని, గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పారు. కానీ, రాష్ట్రంలో 40 లక్షల మంది కౌలు రైతుల్లో లక్ష మందికి కూడా గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. ఈ గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పంట బీమా వారికి వర్తించడం లేదు. బ్యాంకులో రుణాలు పొందడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. "కౌలు రైతుల సమస్యలు పట్టించుకునే నాయకుడు ఎవరూ లేరు!" అని సత్తెనపల్లిలో కాపు సామాజిక వర్గానికి చెందిన రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమను విత్తన రాజధానిగా, హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని కూటమి హామీ ఇచ్చింది. కానీ, రైతుల భూములను సోలార్, గ్రీన్ ఎనర్జీ కంపెనీలకు అప్పగిస్తున్నారని ఈ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. కోత మామిడి కిలో రూ.5 కే అమ్మకాలు జరుగుతున్నాయి. మామిడి గుజ్జు పరిశ్రమలు రూ.12 హామీ ఇచ్చినా అమలు చేయడం లేదని నూజీవీడులో కోటేశ్వరరావు అనే రైతు చెప్పారు. ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్కు రూ.1.50, ట్రాన్స్ఫార్మర్ ధర తగ్గింపు హామీలు కూడా నెరవేరలేదు. అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధర రూ.1,050 వరకు పలుకుతుంటే, కంపెనీలు రూ.500 కంటే తక్కువకు కొంటున్నాయని రవి అనే ఆక్వా రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాదిన పంజాబ్ రైతులు ఉద్యమించేవరకు ఇక్కడి ప్రభుత్వం పట్టించుకోదని వామపక్ష సానుభూతి పరుడైన ఈ రైతు చెప్పారు.

## విమానాశ్రయంలో బీజేపీ నాయకుడికి స్వాగతం



**రేణిగుంట – ఆంధ్రనాడు, జూలై 02:** రాజ్యసభ సభ్యులు భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కే లక్ష్మణ బుధవారం రాక సందర్భముగా బిజెపి నాయకులు స్వాగతం పలికారు. తిరుపతి విమానాశ్రయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రేణిగుంట మండలం ఉప అధ్యక్షులు రాజారాయల్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమల కొండకు ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లారు.

## అంగన్వాడీ కార్యకర్తల సమావేశం



**రేణిగుంట – ఆంధ్రనాడు, జూలై 02:** రేణిగుంట లో బుధవారం అంగన్వాడి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రేణిగుంట ఐ.సి.డి.యస్ ప్రాజెక్టు పరిధిలోనీ అంగన్వాడీ కార్యకర్తల సిడిపిఓ కృష్ణవేణి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తేజో భారత్ ఫౌండేషన్ చైర్మన్ కోలా విశాలాక్షి పాల్గొన్నారు. తిరుపతి పీడీ. వాసంతి, నోడల్ ఆఫీసర్ సబీరన్, సూపర్వైజర్స్ హేమావతి, అనంతలక్ష్మి, అనిత, వాణి, భారతి, తేజో భారత్ సంస్థ సెక్రటరీ లక్ష్మీ ప్రియ పాల్గొన్నారు. తేజ భారత ఫౌండేషన్ చైర్మన్ కోలా విశాలాక్షి మాట్లాడుతూ మండలంలో కిషోర్ బాలికలకు రుతు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి కార్యకర్తలకు వివరించడం జరిగింది. సానిటరీ నాఫికెన్స్ విశాలాక్షి కిషోరి బాలికలకు సానిటరీ నాఫికిన్స్, పిల్లలు కిషోర్ బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రచురించిన బుక్స్ అందరికీ ఇవ్వడం జరిగింది. ఇందులో రేణిగుంట ప్రాజెక్టులోని కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ పాదయాత్ర 2.0



**విజయవాడ – ఆంధ్రనాడు, జూలై 2:**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయింది. టీడీపీ–జనసేన–బీజేపీ ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చంద్రబాబునాయుడు సీఎం అయ్యారు. జనసే అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ఈ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమైంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఈ క్రమంలో కూటమి సర్కార్ ఏడాది పాలన తర్వాత వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. మరోసారి జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. యువనేతల సమావేశంలో తన నిర్ణయం ప్రకటించారు.జగన్ 2017–19 మధ్య చేసిన 'ప్రజా సంకల్పయాత్ర' ఆయనకు రాజకీయంగా గణనీయమైన విజయాన్ని అందించింది. ప్రజల మధ్య ఉండడం, వారి సమస్యలను ఆలకించడం ద్వారా ఆయన వైసీపీని అధికారంలోకి తీసుకొచ్చారు. రాబోయే ఎన్నికల ముందు కూడా అదే ఆయుధం ఎక్కుపెట్టాలని జగన్ భావిస్తున్నారు. ఇది జగన్ 'మాస్ కనెక్ట్' వ్యూహాన్ని సూచిస్తుంది. ఈ పాదయాత్ర ద్వారా, ప్రజలతో భావోద్వేగ సంబంధాన్ని బలోపేతం చేయడంతోపాటు, ప్రతిపక్ష హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను హైలైట్ చేయాలని జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారు.జగన్ తన ప్రకటనలో సోషల్ మీడియా శక్తిని గుర్తించారు, దాన్ని 'ఫోన్ ఆయుధం'గా పేర్కొన్నారు. ఈ రోజుల్లో సోషల్ మీడియా రాజకీయ ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తోంది. వైసీపీ సోషల్ మీడియా విభాగాన్ని బలోపేతం చేయాలని, అన్యాయాలను తక్షణం సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని జగన్ సూచించడం, ఆధునిక రాజకీయ వ్యూహంలో డిజిటల్ వేదికల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఈ వ్యూహం ద్వారా యువ ఓటర్లను, సోషల్ మీడియా యాక్టివిస్టులను ఆకర్షించి, పార్టీ సందేశాన్ని వేగంగా, విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని జగన్ భావిస్తున్నారు.జగన్ యువ నేతలతో సమావేశంలో ఈ ప్రకటన చేయడం కేవలం పాదయాత్ర గురించి మాత్రమే కాదు, పార్టీ భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేయడంలో కూడా భాగమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. యువ నేతలను ఉత్సాహపరచడం, వారిని సోషల్ మీడియా యాక్టివిస్టులుగా మార్చడం ద్వారా, జగన్ రాజకీయంగా చురుకైన, డిజిటల్ యుగానికి అనుగుణమైన నాయకత్వాన్ని తయారు చేస్తున్నారు. ఈ వ్యూహం ద్వారా యువతలో వైసీపీ ఆకర్షణను పెంచడంతోపాటు, ఎన్నికల్లో కీలక ఓటరు వర్గాన్ని లక్ష్యం వ్యూహంగా పేర్కొంటున్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలు, ర్యాగింగులకు దూరంగా ఉండాలి

### - సీఐ జీవన్ గంగానాథ్ బాబు సూచనలు



**బి.కొత్తకోట- ఆంధ్రనాడు, జులై02:** విద్యార్థులు మత్తు పదార్థాలు,ర్యాగింగులకు దూరంగా ఉండాలని సీఐ జీవన్ గంగానాథ్ బాబు సూచించారు. బుధవారం సుంకు జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్,సైబర్ క్రైమ్,మైనర్ డ్రైవింగ్ ,శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని,వాటికి బానిసైతే భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమై పోయాయని,వాటి పట్ల అప్ర మత్తంగా ఉండాలన్నారు. ఓటీపీల పేరుతో ఖాతాలలో నగదు మాయం చేస్తారన్నారు. మత్తు పదార్థాలు, ర్యాగింగ్ వంటివి మీ పరిసరాలలో ఎక్కడైనా జరిగితే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుంకు కాలేజ్ ప్రిన్సిపల్ మంజునాథ్ , విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు,ఆన్లైన మోసాలపై అప్రమత్తంగా ఉండండి

### -ఎస్ఐ ఉమా మహేశ్వర్ రెడ్డి




**తంబళ్లపల్లి-ఆంధ్రనాడు, జూలై 02:** నేటి కంప్యూటర్ యుగంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని.. ఆన్‌లైన్ మోసాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఉమా మహేశ్వర్ రెడ్డి సూచించారు. బుధవారం తంబళ్లపల్లె జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్, ఆన్లైన్ మోసాలు, రోడ్డు భద్రత నిబంధనలు, పోక్సో చట్టం, నూతన ట్రాఫిక్ చట్టాలు, ర్యాగింగ్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత ర్యాగింగ్ కు దూరంగా ఉంటూ అందరూ కలసి మెలసి క్రమశిక్షణతో చదివి దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు రమణ, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయండి



**తొట్టంబేడు - ఆంధ్ర నాడు , జూలై 02 :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అంగన్వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు . సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్న సింగమాల అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు . ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీలు , బాలింతలు మరియు విద్యార్థులకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాత శిశు మరణాలను అరికట్టడంలో అంగన్వాడి కార్యకర్తలు కూడా సహాయ సహకారాలు అందించాలన్నారు . ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సిడిపిఓ బి .శాంతి దుర్గ , సూపర్వైజర్ మరియమ్మ , అంగన్వాడీ కార్యకర్త కోమల తదితరులు పాల్గొన్నారు .

# సిపాయి భరోసా నిత్యావసర సరుకులు అందజేత

శ్రీకాళహస్తి - ఆంధ్రనాడు, జూలై 02 :

శ్రీకాళహస్తి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సోమయ్య కుటుంబ సభ్యులకు బుధవారం సిపాయి భరోసా నిత్యావసర సరుకులు అందజేశారు. సోమయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను ఓదార్చి నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రత్నం రెడ్డి , బాలాజీ రెడ్డి, భారత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .




# స్వర్ణ నారావారిపల్లె -2029

### - అభివృద్ధికి ప్రణాలికలను పూర్తి చేయాలి
### -జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, జూలై 02 :** స్వర్ణ నారావారిపల్లె -2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను త్వరితగతిన సిద్ధంచేసి పనులు చేపట్టాలని, అన్ని గ్రామాలలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కల్లెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు స్వర్ణ నారావారిపల్లె -2029 అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారిని సుశీలదేవి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. వివిధ శాఖాధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజ్ ద్వారా స్వయం సహాయ సంఘాలకు (ఎస్హెచ్జిఎస్) రుణాలు మంజూరు చేయాలని, రిటైల్ అవుట్‌లెట్‌లు ఈజీమార్ట్ సహకారంతో రిటైల్ అవుట్‌లెట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగానికి సంబంధించి కిచెన్ గార్డెనింగ్, టెర్రస్ గార్డెనింగ్‌పై గుర్తించబడిన కుటుంబాలకు శిక్షణ ఇవ్వాలని, వరి పొలాల్లో ద్రవ జీవామృతం సుమారు 1000 ఎకరాలలో పిచికారి చేయాలనీ, రైతుల పొలాల్లో పిఎండిఎస్ కిట్ల ఏర్పాటు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

100% సోలరైజేషన్ సంబంధించిన పంచాయతీల్లో సర్వీసులను త్వరగా సోలరైజ్ చేయాలని, విద్యా రంగానికి సంబంధించి అన్ని పాఠశాల భవనాలను, డిజిటల్ లైబ్రరీ, మైదానం లెవలింగ్ వంటి వసతుల కల్పన ఏర్పాటు చేయాలని, ఆరోగ్య , మహిళా సంక్షేమం ద్వారా మహిళా పోలీసులకు ఆన్‌సైట్ స్క్రీనింగ్ అప్లికేషన్‌లపై శిక్షణ, 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏఐ ఆధారిత స్క్రీనింగ్‌ల 100% పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి ద్వారా సిసి రోడ్లను, త్రాగునీటి ట్యాంక్లు, 33/11 కెవి ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్లు పూర్తి చేయాలని తెలిపారు. నారావారిపల్లి సిహెచ్సి, సిఎస్సి యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఐహెచ్హెచ్ఎల్ (వ్యక్తిగత మరుగుదొడ్లు) పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలని, స్వచ్ఛత కోసం హెూం కంపోస్టింగ్ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎస్సి, ఎస్టి లకు అందించిన ఈ-ఆటోల వలన రోజు వారి ఆదాయం గతంతో పోలిస్తే ఎంత ఆదాయ రాబడి వస్తుందో తెలుసుకోవాలని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఎంత మందికి శిక్షణ ఇచ్చారో, ఎంత మందికి ఉపాది కల్పించారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఎటువంటి అసాంఘీక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా చూడాలని సంబందిత స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులను ఆదేశించారు. పల్లె వనం లు ఏర్పాటు చేయాలనీ, క్యాటిల్ షెడ్ లు అన్ని 100% పూర్తి చేయాలనీ, విద్యా శక్తి కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అలాగే మిగిలిన శాఖల వారు కావలసిన పరిపాలన అనుమతులను పొంది స్వర్ణ నారావారిపల్లి -2029 అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్, డిఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, సిపిఓ వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ ఏడి డా.ఎ.ప్రసాద్, ఏపీఎంఐపి సతీష్, మార్కెటింగ్ ఏడి సురేంద్ర బాబు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు, ఆర్డబ్ల్యుఎస్ఎస్.ఈపివి నరేంద్ర కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఏఎస్ రాజు, పిడబ్ల్యుసి కో-ఆర్డినేటర్ వెంకట్, విద్యాశాఖ, ఐసిడిఎస్, నెడ్ క్యాప్, , అటవీ శాఖ, టూరిజం, పిడి గృహ నిర్మాణ శాఖ అధికారి మరియు స్వర్ణ నారావారి పల్లి -2029 కి సంబందించిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయండి

### -ఎస్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు




**తంబళ్లపల్లి-ఆంధ్రనాడు, జూలై 02:** పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ(ఐటీడీఏ)నెల్లూరు ప్రాజెక్టు అధికారి మల్లికార్జున రెడ్డి సూచించారు.బుధవారం తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి తేజశ్వినితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణం అంతా కలియ తిరిగి పరిసరాలు, పరిశుభ్రతను పరిశీలించారు. పాఠశాలలో మౌళిక వసతులను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి కిటికీలకు మెస్ ఏర్పాటు చేయాలని, మంచి నీటి ట్యాంకులను నెలకు రెండు సార్లు శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో ముఖా ముఖి నిర్వహించి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ మేరకు తాజా కూరగాయలతో వండిన నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. గత ఏడాదికి.. ఈ ఏడాదికి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..త్వరలో రెగ్యులర్ ప్రిన్సిపాల్ తో పాటు, పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమి స్తామన్నారు. అలాగే పాఠశాలకు నూతన భవనం మంజూరుకు ప్రతిపాదనలు పంపామని.. అనుమతులు రాగానే భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు చెప్పారు.



విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ పెట్టి విద్యా బోధన చేయాలని.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారికి వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం



**తిరుపతి రూరల్ -ఆంధ్రనాడు జూలై 02 :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం ఉదయం అష్టోత్తర శత కలశాభిషేకమును వైభవంగా నిర్వహించారు. ప్రతి నెల మొదటి బుధవారం ఆలయంలో ఈ సేవను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి నిత్య కైంకర్యాలు నిర్వ హించారు. ముందుగా వివిధ సుగంధ ద్రవ్యాలతో నింపిన 108 కలశాలను అమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆగమ శాస్త్రోక్తంగా అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ లు రమేష్, ప్రసాద్, ఇన్స్పెక్టర్లు సుబ్బారాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# తిరుచానూరులో నిర్మించిన గ్రామసభ

### -పాల్గొన్న రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి




**తిరుపతి రూరల్ -ఆంధ్రనాడు, జూలై 02 :** తిరుచానూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ ఫైనాన్స్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, తిరుచానూరు 7వ వార్డు మెంబర్ పి. మునిరత్నం రెడ్డి మాట్లాడుతూ తిరుచానూరు పంచాయతీ పరిధిలో పలు సమస్యలను ప్రజలు తమ దృష్టికి ఈవో దృష్టికి తీసుకువచ్చారని, తాగునీళ్లు, పారిశుధ్యం, డ్రైనేజీ కాలవల శుభ్రం, పంచాయతీ అభివృద్ధి పనులు, సిసి రోడ్లు, కాలవలు, స్వర్ణముఖిలో, కాలవలపై అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు చర్యలు తీసుకోవాలని, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, గోవులను వీధులపై వదిలేసిన వారిపై చర్యలు తీసుకోమని, పంచాయతీ కార్యదర్శి మణి, మునిరత్నం రెడ్డి ల దృష్టికి తీసుకొచ్చారని తెలియజేశారు. వారు స్పందిస్తూ ఆ అన్ని విషయాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుచానూరు ఎంపీటీసీలు శివశంకర్, శేఖర్ రెడ్డి, వార్డు నెంబర్ లు పసుపు చంద్ర, మునేంద్ర, విజయలక్ష్మి, 5 సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హస్త కళాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### - జిల్లా కలెక్టర్ డా వెంకటేశ్వర్
### - కళాకారులను ప్రోత్సాహించాలి
### - హస్త కళలు కాపాడటమే ముఖ్యమంత్రి లక్ష్యం
### -ఏపి హ్యాండ్ క్రాఫ్ట్ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్



**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, జూలై 02 :** హస్త కళాకారులు మంచి జీవనోపాధి పెంపొందించు కోవాలంటే వారు తయారు చేసిన వస్తువులు యొక్క ఉత్పత్తి, లాభం, ప్రచారం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం తిరుపతి కలెక్టరేట్ విసి హాల్ నందు జిల్లా డా.ఎస్.వెంకటేశ్వర్, ఎపి హ్యాండ్ క్రాఫ్ట్స్ చైర్మన్ డా.హరి ప్రసాద్ తో కలసి డిఆర్డిఎ, డిఐసి, లేపాక్షి, శిల్పారామం, టూరిజం, నాబార్డ్, హ్యాండ్ లూమ్స్, ఖాదీ బోర్డ్, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ల అధికారులతో, హస్త కళలు, హ్యాండ్ లూమ్స్ కళాకారులు, అసోసిఎషన్, సొసైటీల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలో చుట్టుపక్కల గ్రామాల లోని చిన్న కుటుంబాలు నుంచి కూడా ఎంతోమంది హస్త, కళంకారీ కళల పైన ఆధారపడి తమ జీవనోపాధి చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో కలంకారి, హస్త కళలకు, మాధవమాల, వెంకటగిరి చీరలకు, పాపా నాయుడుపేట పూసల కళాకారులకు దేశవ్యాప్తంగా మంచి పేరు, గుర్తింపు రావడం జరిగిందని గర్వంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హస్త కళాకారులకు అండగా ఉంటుంది, వారి జీవనోపాధి పెంపొందించే దిశగా కృషి చేస్తుంది అని తెలిపారు.హస్త కళాకారుల కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో హస్త కళాకారుల సంబంధించిన సమావేశం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కళాకారులను, కళలను కాపాడుకోవాలని అనేది ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ లక్ష్యంతో హస్త కళాకారులను ప్రోత్సహించాలని అన్నారు.

## నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి**



**కార్వేటినగరం - ఆంధ్రనాడు, జూలై 02:** నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. జీడి నెల్లూరులో ఉన్న జైన్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న మామిడి రైతులను వైఎస్ఆర్సిపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కృపా లక్ష్మి తో కలిసి ఆయన పరామర్శించి స్థానిక రైతుల పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏనాడు కూడా మామిడి రైతు నష్టపోలేదని కూటమి ప్రభుత్వ ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే మామిడి రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మామిడి రైతులు పండించిన పంటను కూడా అమ్ముకునేందుకు స్వేచ్చ లేదని కృపా లక్ష్మి అన్నారు. ఫ్యాక్టరీలో ఆలస్యంగా తెరవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పంటను ఫ్యాక్టరీకి తరలించాలంటే ఐదు రోజులు పడుతున్న ప్రభుత్వం రైతు కష్టాలు మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర ను వెంటనే చెల్లించాలని రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ చందు రాజు తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న రైతులకు భోజనం ప్యాకెట్లు, మజ్జిగ అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## సత్యవేడు టీడీపీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా కూరపాటి శంకర్ రెడ్డి



**సత్యవేడు - ఆంధ్రనాడు, జూలై 02:** సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి (పార్టీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్) గా సత్యవేడు మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త కూరపాటి. శంకర్ రెడ్డిని బుధవారం జాతీయ అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించారు. ఈ సందర్భంగా కూరపాటి. శంకర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ వారి సహకారంతో సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

## అంటువ్యాధులపై అవగాహన

**రేణిగుంట - ఆంధ్రనాడు, జూలై 02:** అంటు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ కామరాజు తెలియజేశారు. బుధవారం ఎల్లమండెంలో జరిగిన గ్రామసభలో డెంగ్యూ, డయేరియా ఇతర సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులుపై ప్రతి ఒక్కరుకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, బోదకాలు వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వారంలో ఒకరోజు డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహించాలని తెలిపారు. ఇంటింటికి తిరిగి దోమల లార్వా సర్వే కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్ర, ఏ.ఎన్.ఎం.జయంతి, పాల్గొన్నారు.

## వృద్ధులకు రొట్టెలు, పాలు పంపిణీ



**పెద్దపంజాణి - ఆంధ్రనాడు, జూలై 02:** మండలంలోని తులసమ్మగుడి సమీపంలో గల జీవదాత వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పుట్టినరోజు సందర్భంగా రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బాదంపాలు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు, నాయకులు ఎల్.భాస్కర్, సుబ్రమణ్యం, గంగప్ప, శంకరప్ప పాల్గొన్నారు.

## విష జ్వరంతో బాలిక మృతి



**చంద్రగిరి - ఆంధ్రనాడు, జూలై 2:** చంద్రగిరి పట్టణం సమీపంలోనిఅనే బాలిక రాయలపురం పంచాయతీలో విష జ్వరంతో జాస్మిన్ (16) మృతి చెందినది. స్థానికులు అందించిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. జాస్మీన్ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా వైద్య సిబ్బంది కన్నెత్తి చూడలేదు. బుధవారం జ్వరం అధికమై ఫిట్స్ రావడంతో చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్ళగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మధ్యాహ్నం ఒంటి గంటకు మృతి చెందినా పంచాయితీ వైద్య సిబ్బంది, కనీసం ఆసుపత్రికి రాలేదు. జాస్మిన్ మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ వున్నారు.

# బనకచర్లకు నో ఎందుకు...?



**ఏలూరు - ఆంధ్రనాడు**

బనకచర్ల. ఇటీవల తరచూ వినిపిస్తున్న మాట ఇది.. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత బనకచర్ల ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. సముద్రంలో కలిసే వృధా జలాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు భావి ంచారు. అది పోలవరం ప్రాజెక్టు ద్వారా బనకచర్లకు అను సంధానించి.. రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే తెలంగాణ ప్రభుత్వంతో పాటు అక్కడ అన్ని రాజకీయ పక్షాలు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరే కిస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టు నిర్మించకూడదని భావిస్తున్నాయి. అయితే ఇది సంక్లిష్టమైన సమస్యగా మారిన నేపథ్యంలో.. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం పర్యావరణ అను మంతులను నిలిపివేసింది. ఒక విధంగా ఇది ఏపీలో కూటమి ప్రభుత్వానికి షాకింగ్ పరిణామమే. వృధా జలాలను విని యోగించుకునేందుకు.. గోదావరిలోనిరంతర నీటి ప్రవాహం ఉంటుంది. వర్షాకాలంలో అయితే భారీ స్థాయిలో వరద నీరు పోటెత్తుతుంది. ఆ సమయంలో వేల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తుంది.

అయితే ఏటా వృధాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి వరద జలాలను రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తరలించేందుకు వీలుగా బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలన్నది ఏపీ ప్రభుత్వ లక్ష్యం. ఏపీ ప్రభుత్వం చెబుతున్నట్టు ఏటా రెండు వేల టీఎంసీల నీరు సముద్రంలో వృధాగా కలిసిపోతుంది. అందుకే వరదల సమయంలో 200 టీఎంసీలను మళ్లించాలని ఏపీ సర్కారు నిర్ణయించింది. అందుకే గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది.రూ. 80,112 కోట్లతో ఈ ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుకు సైతం ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.ఈ ప్రాజెక్టుతో రాయలసీమ సస్యశ్యామలంగా మారుతుంది అన్నది ప్రభుత్వ ఆలోచన. తాగునీటితోపాటు కొత్తగా మూడు లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీరు అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. సాగర్ కుడి కాలువ, వెలిగొండ, గాలేరు, నగరి, కెసి కెనాల్, తెలుగు గంగా కింద 22 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలన్నది ఏపీ ప్రభుత్వం నిర్ణయం. మూడు దశల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నది ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణానదిలోకి.. అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్ లోకి నీటిని మళ్లించనున్నారు. అక్కడ నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్కు తరలించాలన్నది ఏపీ సర్కార్ ప్లాన్. అంటే మొదటి దశ కింద పోలవరం నుంచి కృష్ణా నదికి జలాల మళ్లింపు, సెకండ్ పేజ్ కింద గొల్లపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించి.. అక్కడ నుంచి తరలించాలని చూస్తోంది. ఫైనల్ ఫేస్ లో భాగంగా బొల్లపల్లి నుంచి బనకచర్ల రెగ్యులేటర్ కు నీళ్లు తరలించాలని చూస్తోంది.ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గాను 48 వేల ఎకరాల భూమిని సమీకరించాల్సి ఉంది. రెండు టన్నేళ్లు, 9 చోట్ల పంప్ హౌస్ ల నిర్మాణం అవసరం. కొన్నిచోట్ల గ్రావిటీ కాలువల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టుకు తెలంగాణనుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇంకా తెలంగాణతో సరిహద్దు జలాల వివాదం తేలాల్సి ఉంది. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే.. ముందు ఆ నది యాజమాన్యం బోర్డు, సిడబ్ల్యూసి, జల్ శక్తి మంత్రి అధ్యక్షతన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎఫెక్స్ కౌన్సిల్లో చర్చించి అనుమతి పొందాలి. అయితే ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘిస్తోందని తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు చేయడంతో.. పర్యావరణ అనుమతులు రాలేదని బ్రేక్... మాత్రమే అంటున్న టీడీపీ బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. బనకచర్లకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది.

బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిన కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కార్ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తిప్పి పంపింది. అయితే ఇది తాత్కాలిక బ్రేకులా? లేక శాశ్వతంగా అనుమతులు ఇవ్వరా? అన్నది తేలాల్సి ఉంది. కానీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యానే బనకచర్లకు అనుమతులు ఇవ్వకోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. అందుకే ఏపీ ప్రభుత్వానికి చెందిన నేతలు మాత్రం ఇది తాత్కాలిక బ్రేకులేనని, ఖచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిని గేమ్ ఛేంజర్ గా చంద్రబాబు అభివర్ణించారు. గోదావరిలో వృధాగా తరలిపోయే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా రాయలసీమతో పాటు కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు మళ్లించాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఎనభైవేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశార. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీ కలసి ఉండటంతో సులువుగా అనుమతులు సాధించవచ్చని భావించి ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. అయితే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజుకుంది. తమకు న్యాయంగా దక్కాల్సిన గోదావరి నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుందని తెలంగాణలోని అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలసి వచ్చారు. మరొకవైపు తెలంగాణ బీజేపీ నేతలు కూడా పార్టీ నాయకత్వంపై వత్తిడి తెచ్చారు. బనకచర్లకు అనుమతులు మంజూరు చేస్తే ఆ ప్రభావం తెలంగాణ రాజకీయాల్లో పడే అవకాశముందని పార్టీ పెద్దలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయ్యారు. అందుకే పర్యావరణ అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. .. తెలంగాణ నుంచి అనేక అభ్యంత రాలు ప్రాజెక్టుపై వ్యక్తమయ్యాయి. నీటి కేటాయింపులకు విరుద్ధమంటూ ఢిల్లీ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ గళమెత్తారు. వరద జలాలపై సమగ్ర అధ్యయనం చేయాలంటూ డిమాండ్ చేశారు. అందుకే ముందుగా అంతరాష్ట్ర అనుమతులు ప్రాజెక్టుకు పొందాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిధుల కేటాయింపు కూడా కష్టసాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై పునరాలోచించే వీలుందని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతిస్తే తెలంగాణలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని భావించి బ్రేకులు వేసిందన్నది వాస్తవం.

# అభివృద్ధికి ఆదర్శం .. కూటమి ప్రభుత్వం

**- డబుల్ ఇంజన్ సర్కారుతో అన్ని రంగాలకు జవసత్వాలు**



**రామచంద్రాపురం - ఆంధ్రనాడు, జూలై 2:** కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ఆదర్శంగా, సంక్షేమానికి చిరునామాగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్నదని రామచంద్రపురం తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సూచనలతో బుధవారం రామచంద్రాపురం మండలంలోని, రావిళ్ళవారిపల్లి పంచాయితీ, బ్రాహ్మణ కాలవ ఏ ఏ డబ్ల్యులో కూటమి ప్రభుత్వం ఎడాది సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింట ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన ఏడాది పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను, సాధించిన విజయాలను వివరించారు. అదేవిధంగా నియోజకవర్గంలో శాసనసభ్యులు పులివర్తి నాని మండలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.మండలంలో మూడు కోట్ల 50 లక్షలతో గ్రామాలలో పలు సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందన్నారు. పలు గ్రామాలకు రాకపోకల సాగించటానికి అనువుగా గుండోడు కనుమ రోడ్డును మూడున్నర కోట్ల రూపాయలతో కొత్తగా నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. మండలంలోని మహిళలకు 10 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయడ మైనదని చెప్పారు. రైతులకు 50% సబ్సిడీ తో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేసినట్లు తెలియజేశారు.రాయల చెరువు కట్టపైన బస్సు షెల్టర్, చేపల మార్కెట్ నిర్మించడం జరిగిందని ప్రజలకు వివరించారు. డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రంలో అన్ని రంగాలకు జవతత్వాలు సమకూరాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఈతమాకుల ఉమాపతి నాయుడు, ఆర్ గిరి నాయుడు, కొట్ట నరసింహారెడ్డి, కోరా హరిప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ కే మధుసూదన్ రెడ్డి, కే.మునిరామిరెడ్డి, చంద్రగిరి నియోజకవర్గం యువత ఉపాధ్యక్షులు కొట్ట ధనంజయ రెడ్డి, ఎల్ సురేందర్ నాయుడు, సాయి ప్రసాద్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**కార్వేటి నగరం - ఆంధ్రనాడు, జూలై 02:** మండల పరిధిలోని డీ.ఎం.పురం ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి హెచ్.ఎం నాదముని రెడ్డి అధ్యక్షత వహించగా పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ త్యాగరాజ,వైస్ చైర్మన్ సంధ్య గ్రామ పెద్దలు సోమసుందరం పిళ్ళై, సుధాకర్ లు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుల పనితీరును వక్తలు కొనియాడారు. విద్యార్ధినీ విద్యార్థులు ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. హెచ్.ఎం నాదముని రెడ్డి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు హెచ్.ఎం కేశవులు, హరిత, సుబ్రమణ్యం రెడ్డి, వెంకటరమణయ్య, డిల్లీ బాబు, చిన్నయ చెట్టి, తిరుమల రాజు అందరినీ దుశ్శాలువా, మోమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాద్యాయులు సరస్వతి, మాలతి, కలైవాణి, సుమతి, రాములు, రవి కుమార్, కిషోర్ కుమార్, బొజ్జా రాములు, రంజిత్ కుమార్, హరి గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P.,
Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733